సాక్షి కామారెడ్డి

గురువారం । 28 । నవంబర్ । 2024



వేలం ఎప్పుడో?

అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యాన్ని వేలం వేయకపోవడంతో ఎంఎల్ఎస్ పాయింట్లలో మురిగిపోతున్నాయి.

- 10లో ▸



టార్పాలిన్ల భారం

ప్రభుత్వం టార్పాలిన్లు అందించకపోవడంతో వాటి కిరాయి భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /9.5

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ ఒకటో తేదీన ప్రారంభం కానుంది. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తామని పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు.

'ఈవీఎంలు ట్యాంపరింగ్ కావు'

కామారెడ్డి క్రైం: ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) ట్యాంపరింగ్ కావని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో జరిగే ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం కొట్టి వేసిందని పేర్కొన్నారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ వాదనలను ధర్మాసనం తిరస్కరించిందని తెలిపారు. ఎన్నికలలో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తి చూపిందని పేర్కొన్నారు.

'84,109 మెట్రిక్ టన్నుల సన్న వడ్లు సేకరించాం'

కామారెడ్డి క్రైం: ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 95,423 ఎకరాల్లో సన్న రకం వరి సాగయ్యిందని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల ద్వారా 12,224 మంది రైతుల నుంచి 84,109.32 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. 8,920 రైతులకు సంబంధించి రూ.30.20 కోట్లను బోనస్‌గా చెల్లించామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్ హాజరు

- ఆదేశాలు జారీ చేసిన టీవీవీపీ కమిషనర్

కామారెడ్డి టౌన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో తక్షణమే బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త(డీసీహెచ్ఎస్) విజయలక్ష్మితో పాటు జిల్లాలోని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లకు ఉత్తర్వులు అందాయి. వైద్యులు, సిబ్బంది గైర్హాజరవుతుండడంతో పాటు, విధులకు ఆలస్యంగా వస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకోసం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని టీవీవీపీ కమిషనర్ సూచించారు. అటెండెన్స్ మానిటరింగ్ సిస్టమ్ కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా క్రమం తప్పకుండా రోజు వారీగా హాజరు నివేదికను ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించారు. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. కాగా గతంలోనూ బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని ఆదేశాలు వచ్చినా.. ఎక్కడా అమలు కాలేదు. దీంతో తాజాగా మళ్లీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసారి కూడా ఆ ఉత్తర్వులను అమలు చేస్తారో లేదో చూడాలి. బయోమెట్రిక్ హాజరు విధానం అమలయితే ఆస్పత్రులలో వైద్య సేవలు మెరుగుపడతాయని ప్రజలు భావిస్తున్నారు.



సరంపల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

హాస్టల్ బాట!

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- పిల్లలతో కలిసి భోజనాలు
- పక్కాగా మెనూ అమలుకు అడుగులు
- మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: అధికారులు హాస్టళ్ల బాట పట్టారు. మెనూను పక్కాగా అమలు చేసేందుకు విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్నారు. సౌకర్యాలపై ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లాలోని 129 సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పరిస్థితులను పరిశీలించి, వాటిని మెరుగుపరచడానికి జిల్లా, మండల స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో మూడు రోజులుగా అధికారులంతా తమకు కేటాయించిన హాస్టళ్లకు వెళ్తున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు వి.విక్టర్, డి.శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు, జిల్లా అధికారులందరూ హాస్టళ్లను చుట్టేస్తున్నారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేయడం ద్వారా భోజనం నాణ్యతను తెలుసుకుంటున్నారు. స్టోర్‌లో ఉన్న నిత్యావసరాలు, నిల్వ ఉంచిన కూరగాయలు, పరిసరాలను పరిశీలిస్తున్నారు. కాగా జిల్లా, మండల అధికారులు తమకు కేటాయించిన హాస్టళ్లను వారానికి ఒక రోజు తప్పనిసరిగా తనిఖీ చేయాలి. అధికారులు వచ్చినపుడు అక్కడ భోజనంలో నాణ్యత లేకుంటే అదనపు కలెక్టర్‌కు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.

హాస్టళ్లను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తున్నాం

విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మంచి విద్యనందించాలన్న ఉద్దేశంతో హాస్టళ్లను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తున్నాం. మెనూ అమలుతోపాటు నిత్యావసరాలు, కూరగాయలు నాణ్యమైనవి వాడేలా చూస్తున్నాం. ఎక్కడ పొరపాటు జరిగినా ఇబ్బందులు తప్పవు. విద్యార్థులను తమ పిల్లలుగా భావించి వారికి మంచి భోజనం అందించడంతో పాటు వారు బాగా చదువుకుని ప్రయోజకులు అయ్యేలా నిర్వాహకులు ప్రయత్నించాలి. హాస్టళ్లలో అపరిశుభ్ర వాతావరణం ఉంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెబుతున్నాం. మార్పు కనబడుతోంది.

– ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్

మార్పు మొదలు..

ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్‌తో కొందరు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హాస్టళ్లలో మెనూ అమలు తీరు, పరిస్థితులపై దృష్టి సారించింది. చీఫ్ సెక్రెటరీ ఆదేశాలతో కలెక్టర్లు రంగంలోకి దిగారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) చైర్మన్‌గా, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కోచైర్మన్‌గా జిల్లా స్థాయి అధికారులు సభ్యులుగా జిల్లా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. అలాగే మండల స్థాయిలో మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో మండల అధికారులు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. ఆయా కమిటీల సభ్యులు మూడు రోజులుగా హాస్టళ్లను చుట్టేస్తున్నారు. గతంలో హాస్టళ్లలో నిర్వాహకులు పెట్టిందే మెనూ అన్నట్టుగా నడిచేది. ఇప్పుడు అధికారుల పర్యవేక్షణ పెరగడంతో మెనూ పక్కాగా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. హాస్టళ్ల నిర్వాహకులు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. మెనూ అమలులో మార్పు కనబడుతోందని విద్యార్థులు చెబుతున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన సరంపల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలను సందర్శించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పైప్‌లైన్ లీకేజీలను సరిచేయాలన్నారు. స్టోర్ రూంలో సరుకులను పరిశీలించారు. బియ్యంలో రాళ్లులేకుండా శుభ్రం చేసి వంటకు ఉపయోగించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టళ్ల కమిటీలు రోజూ వంటలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో తిరుమల ప్రసాద్, గిరిజన సంక్షేమ అధికారి రజిత, పాఠశాల ప్రిన్సిపాల్ అమర్‌సింగ్, రీజనల్ కోఆర్డినేటర్ గంగారాం నాయక్, ఫుడ్ సేఫ్టీ అధికారి శిరీష, తహసీల్దార్ సాయిలు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డోంగ్లీ @ 9.5 డిగ్రీలు!

- చలితో వణుకుతున్న జనం
- జిల్లా అంతటా చలిగాలులు
- జలుబు, దగ్గు, జ్వరాలతో ఆస్పత్రులకు..



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో చలితీవ్రత మరింత పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జనం చలితో వణుకుతున్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో కనిష్ట ఉష్ణోగ్రత 9.5 డిగ్రీలుగా నమోదైంది. మద్నూర్ మండలం మేనూర్‌లో 10.3 డిగ్రీలు, జుక్కల్‌తో పాటు నస్రుల్లాబాద్ మండలం బొమ్మదేవ్‌పల్లిలో 10.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో పాటు చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పుడే చలి తీవ్రత ఇలా ఉంటే ముందుముందు ఇంకెలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. కాగా దగ్గు, జలుబు, జ్వరంతో ఆస్పత్రులకు వరుస కడుతున్నారు. ఏ ఆస్పత్రికి వెళ్లినా పేషెంట్లతో నిండిపోయి ఉంటున్నాయి.

జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతల వివరాలు..

గ్రామం	కనిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీలలో)	గ్రామం	కనిష్ట ఉష్ణోగ్రత	గ్రామం	కనిష్ట ఉష్ణోగ్రత
డోంగ్లీ	9.5	ఎల్పుగొండ	11.9	అర్గొండ	12.9
మేనూర్	10.3	పుల్కల్	12	బీబీపేట	13.1
జుక్కల్	10.9	రామారెడ్డి	12.1	పిట్లం	13.2
బొమ్మదేవ్‌పల్లి	10.9	ఇసాయిపేట	12.4	హసన్‌పల్లి	13.3
లచ్చాపేట	11.2	గాంధారి	12.4	పాతరాజంపేట	13.8
భిక్కనూరు	11.3	రామలక్ష్మణ్‌పల్లి	12.4	సోమూర్	14.1
బిచ్కుంద	11.5	మాచాపూర్	12.5	తాడ్వాయి	14.1
సర్వాపూర్	11.7	లింగంపేట	12.6	భిక్కనూరు	14.7
నస్రుల్లాబాద్	11.7	కొల్లూరు	12.6	పెద్దకొడప్‌గల్	14.9
		దోమకొండ	12.6	మగ్దుంపూర్	15
		నాగిరెడ్డిపేట	12.8	సదాశివనగర్	15.1

మాతాశిశు మరణాలను అరికట్టాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: మాతాశిశు మరణాలను అరికట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్యాధికారులకు సూచించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వెలుగుచూసిన కొన్ని ఘటనల్లో మాతాశిశు మరణాలు నివారించగలిగినవే అయినప్పటికీ క్షేత్ర స్థాయిలోని సిబ్బంది అవగాహన లోపం కారణంగా మరణాలు సంభవించినట్లు తెలుస్తోందన్నారు. మాతాశిశు మరణాలకు సంబంధించిన నివేదికలను వెంటనే తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని ప్రదేశంలో ఉండాలన్నారు. మాతాశిశు మరణాలు సంభవించకుండా సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్‌లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ ఫరీద, పీవోఎంహెచ్ఎన్ శ్రీకర్, పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి డెయిరీ కళాశాలకు మహర్దశ!



కామారెడ్డి డెయిరీ కళాశాల

- రూ.4 కోట్ల విరాళం ప్రకటించిన దొడ్ల డెయిరీ
- అన్ని వసతులుంటేనే ఎంటెక్ పీజీ కోర్సు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి డెయిరీ కళాశాలలో మౌలిక సదుపాయల కల్పన కోసం దొడ్ల డెయిరీ కంపెనీ రూ. 4 కోట్ల విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చింది. దీనిపై కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతనెల వరకు కళాశాల డీన్‌గా పనిచేసిన శరత్‌చంద్ర ప్రమోషన్‌పై తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా వెళ్లిన విషయం తెలిసిందే. ఆయన కళాశాలలో ఎంటెక్ కోర్సు కోసం ప్రయత్నించారు. కాగా ఎంటెక్ కోర్సు మంజూరవ్వాలంటే అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండాలి. గతంలో కామారెడ్డి డెయిరీ కళాశాలను సందర్శించిన దొడ్ల డెయిరీ సీఈవో బీవీకే రెడ్డి దృష్టికి కళాశాల సమస్యలను శరత్‌చంద్ర తీసుకువెళ్లారు. వాటిని పరిశీలించిన దొడ్ల డెయిరీ.. కామారెడ్డి డెయిరీ కళాశాలలో మౌలిక వసతులు కల్పించడానికి రూ.4 కోట్ల విరాళం అందిస్తామని ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో పశుసంవర్ధక శాఖ కార్యదర్శికి లేఖను అందజేసింది. దొడ్ల డెయిరీ ప్రకటించిన రూ.4 కోట్లతో కళాశాలతోపాటు హాస్టళ్లకు సిమెంట్ రోడ్లు, కళాశాల భవనానికి మరమ్మతులు, సుందరీకరణ, మినీ డెయిరీ ప్లాంట్ తదితర పనులు చేపడతారని కళాశాల అసోసియేట్ డీన్ కేఏస్ ఉమాపతి తెలిపారు. విశ్వవిద్యాలయం అంగీకరిస్తే పనులను దొడ్ల డెయిరీ ఇంజనీరింగ్ అధికారులే చేపట్టనున్నట్లు తెలిసింది. మౌలిక సదుపాయాలుంటే ఐసీఆర్ తనిఖీలు చేసి ఎంటెక్ డెయిరీ కోర్సు మంజూరు చేసే అవకాశాలుంటాయని భావిస్తున్నారు.

రాష్ట్రాన్ని అదానీకి అమ్మకానికి పెట్టిన సీఎం

- తెలంగాణలో అరాచక పాలన
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బాన్సువాడ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణను అదానీకి అమ్మకానికి పెట్టారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బుధవారం బాన్సువాడలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ ఇంట్లో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్షకు దిగిన నవంబర్ 29ని దీక్షా దివస్‌గా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 29న కామారెడ్డిలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. సభకు రాకుండా కాంగ్రెస్ నేతలు, పోలీసులు అడ్డుకుంటే నేరుగా తనకు ఫోన్ చేయాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ వల్ల లబ్ధి పొంది, కన్నతల్లి లాంటి పార్టీని, కేసీఆర్‌ను మోసం చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి భయపడవద్దన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు విష పూరిత భోజనాలు పెడుతున్నారని, ఆ విషాహారం తిని ఇటీవల గురుకుల విద్యార్థిని ఒకరు మరణించారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మరో గురుకుల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గురుకులాల్లో కౌన్సిలర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జరుగుతున్న అరాచక పాలన నుంచి ప్రజలను కాపాడాల్సిన అవసరముందన్నారు. ఈ అరాచక పాలననుంచి విముక్తి కల్పించడం కేసీఆర్, కేటీఆర్‌లతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సాయిబాబా, మోచి గణేష్, మహేష్, మల్లేశంగౌడ్, గౌస్, శివ, రమేష్ యాదవ్, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల్లో మనోళ్లే కీలకం!

- పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.దామోదర్‌రెడ్డి
- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సీహెచ్ అనిల్‌కుమార్
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొంగల వెంకట్
- కీలక భూమిక పోషిస్తున్న జిల్లావాసులు



దామోదర్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



అనిల్‌కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



వెంకట్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర కమిటీలలో కామారెడ్డి జిల్లాకు చెందినవారు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలోనూ వివిధ సంఘాలకు జిల్లాకు చెందిన పలువురు రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. అయితే ఈ దఫా మూడు సంఘాలకు రాష్ట్రస్థాయిలో కీలక పదవుల్లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయ నేతలు ఉండడం గమనార్హం. దోమకొండలో విధులు నిర్వహిస్తున్న పి.దామోదర్‌రెడ్డి పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవలే ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లలో పనిచేస్తున్న కొంగల వెంకట్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఎల్లారెడ్డి మండలం మత్తమల్‌లో పనిచేస్తున్న సీహెచ్ అనిల్‌కుమార్ ఇటీవలే టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గతంలోనూ జిల్లాకు చెందిన పలువురు వివిధ సంఘాలకు రాష్ట్ర స్థాయిలో నాయకత్వం వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన కే.వేణుగోపాల్ చాలాకాలం పాటు పనిచేశారు. టీపీటీఎఫ్ మాసపత్రిక నిర్వహణ బాధ్యతలు ఆయనే చూస్తున్నారు. అలాగే ఏపీటీఎఫ్‌తో పాటు టీటీఎఫ్‌లో కామారెడ్డికి చెందిన టి.హన్మాండ్లు కీలకంగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంతో పాటు జలసాధనోద్యమంలోనూ ఆయన క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఇప్పటికీ ఆయన వివిధ ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. కామారెడ్డికి చెందిన కే.రమణ టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. కామారెడ్డికి చెందిన డాక్టర్ జి.లచ్చయ్య ఏపీటీఎఫ్, డీటీఎఫ్ సంఘాల్లో కీలకభూమిక పోషించారు. డీటీఎఫ్ పత్రిక అధ్యాపక జ్వాలకు ఎడిటర్‌గానూ పనిచేశారు. ఇప్పటికీ ఆయన ప్రజ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగ సంఘాలకు నాయకత్వం వహిస్తున్నారు. కాలమిస్టుగా ఆయన సామాజిక, రాజకీయ అంశాలతో పాటు జాతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా వివిధ పత్రికలకు రాస్తున్నారు. కామారెడ్డికి చెందిన డాక్టర్ వీఆర్ శర్మ కూడా ఏపీటీఎఫ్, టీటీఎఫ్ సంఘాల్లో కీలకంగా పనిచేశారు. పత్రికల నిర్వహణలో భాగమై పనిచేశారు. మరికొందరు కూడా వివిధ ఉపాధ్యాయ సంఘాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

వంతెనను ఢీకొన్న కారు: తండ్రీకుమారుల మృతి





శివరాజ్ దేశాయ్ (ఫైల్), రాజశేఖర్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): సంగారెడ్డి– నాందేడ్ అకోలా రహదారిపై అల్లాదుర్గంలో బుధవారం వంతెనను కారు ఢీకొన్న ఘటనలో తండ్రీకుమారులు శివరాజ్ దేశాయ్(71), రాజశేఖర్ దేశాయ్(49) మృతి చెందారు. వివరాలు.. కోటగిరి మండలం బస్వాపూర్‌కు చెందిన రాజశేఖర్ తన తండ్రి శివరాజ్, తల్లి లక్ష్మీబాయి, భార్య అరుణ, కూతురు అనన్యతో కలిసి హైదరాబాద్ నుంచి బోధన్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో అల్లాదుర్గం హైవేపై అతివేగంతో ఉన్న వారి కారు అదుపు తప్పి వంతెనను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు జోగిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజశేఖర్, శివరాజ్ మృతి చెందారు. కారులోని మిగతా ముగ్గురు గాయపడగా వారిని హైదరాబాద్ తరలించారు. శివరాజ్ దేశాయ్ బోధన్ సీడీసీ చైర్మన్‌గా, కోటగిరి జెడ్పీటీసీగా, బస్వాపూర్ సర్పంచ్‌గా సేవలందించారు. ఘటన గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి, మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి పెద్దపీట



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నాయకులు

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రూ.85 కోట్లకుపైనే బోనస్ జమ
- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తోందని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సన్న రకాలకు రూ.500 బోనస్ జమ చేస్తున్న సందర్భంగా బుధవారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రూ.85 కోట్లకుపైగా బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. రుణమాఫీతోపాటు బోనస్ డబ్బులు జమ చేస్తుండటంపై రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, రైతు భరోసా, కూరగాయల సాగుకు ప్రోత్సాహం, చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బ్యాంకు వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, డైరెక్టర్ లింగయ్య, సొసైటీ చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, రామకృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, హన్మంతు, సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రధాని మోదీని కలిసిన ఎమ్మెల్యే కేవీఆర్



కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రధానిని కలిసి రాష్ట్ర అభివృద్ధి, సమస్యలపై చర్చించారు.

ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌ను కలిసిన జుక్కల్ కాంగ్రెస్ నేతలు



నిజాంసాగర్(జుక్కల్): ఢిల్లీలో ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ రాజేష్ లిలోతియాను బుధవారం జుక్కల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ సౌదాగర్ అరవింద్ కలిశారు. జుక్కల్ నియోజకవర్గంలో నామినేటెడ్ పోస్టుల వ్యవహారంలో అభ్యర్థుల ఎంపికపై తమకు జరుగుతున్న అన్యాయాలపై లితోతియాకు వివరించినట్లు అరవింద్ తెలిపారు.

సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: క్రిస్మస్ పండుగ సందర్భంగా సామాజిక, విద్య, వైద్యం, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవ అందించిన, ప్రతిభ కనబర్చిన 30 ఏళ్లు పైబడిన క్రైస్తవ వ్యక్తులు, సంస్థలను ఎంపిక చేసి ప్రభుత్వపరంగా సత్కరించనున్నట్లు అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ కార్యాలయం 222 నంబర్ గదిలో తమ నామినేషన్లను డిసెంబర్ 5లోగా అందజేయాలని సూచించారు. లేదా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయవచ్చన్నారు.

చెట్లతో కలిగే ఉపయోగాలపై అవగాహన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్) ఆధ్వర్యంలో చేపట్టిన వారోత్సవాలలో భాగంగా గోపాల్‌పేట హైస్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వనదేవతల వేషధారణతో గోపాల్‌పేటలో ర్యాలీ తీశారు. చెట్లను పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలతోపాటు ఆక్సిజన్ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. దీంతోపాటు పచ్చదనం-పరిశుభ్రత, మొక్కల పెంపకం అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సీజీఆర్ మెంటర్ టీచర్ సభాత్ కృష్ణ, ఉపాధ్యాయులు రాము, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'లస్కర్' చుట్టూ దందా!

- ఎస్సారెస్పీ డివిజన్–1 లో ఒక్క లస్కర్ పోస్టు
- ఎస్సారెస్పీ డివిజన్–1లో ఉన్నది ఒక్క పోస్టు
- భర్తీ చేసేది ఒక్క పోస్టు అయినా.. వందల పోస్టుల భర్తీ అంటూ ప్రచారం
- మధ్యవర్తుల ఉచ్చులో చిక్కుకుంటున్న నిరుద్యోగులు



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ జీవీసీ(గోదావరి వ్యాలీ సర్కిల్)–1 పరిధిలో మొత్తం 7 లస్కర్ పోస్టులను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించేందుకు ప్రభుత్వం అనుమతించింది. అందులో ఎస్సారెస్పీ డివిజన్–1 విభాగంలో ఒక్క పోస్టు మాత్రమే కేటాయించింది. కానీ ఎస్సారెస్పీ డివిజన్–1లో వందల పోస్టుల కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రచారం చేస్తూ ఉద్యోగులు ఇప్పిస్తామంటూ ఎస్సారెస్పీలో దందా షురూ చేశారు. అసలు విషయం తెలియక ఉద్యోగాల ఆశతో అనేక మంది నిరుద్యోగులు ఎస్సారెస్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతూ మధ్యవర్తుల ఉచ్చులో పడుతున్నారు.

ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు సైతం ఇప్పటి వరకు లస్కర్‌ల నియామకంపై ఎలాంటి ప్రకటన ఇవ్వలేదు. కానీ దరఖాస్తు ఇస్తే మాత్రం కార్యాలయంలో స్వీకరిస్తున్నారు. అసలు ఏమి జరుగుతుందో తెలియక నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అవసరం ఉంది..

ఎస్సారెస్పీ డివిజన్–1 విభాగంలో పని చేసేందుకు కనీసం 30 మంది లష్కర్‌ల కొరత ఉంది. 30 మంది లష్కర్‌లను నియమించినా సరిపోని పరిస్థితి ఉంది. కానీ ఎస్సారెస్పీలో పదవీ విరమణలే తప్ప నూతన ఉద్యోగుల రాక లేదు. దీంతో ప్రాజెక్ట్ నుంచి అనేక సబ్ డివిజన్‌లు తరలిపోయి కళను కోల్పోయింది. ప్రస్తుతం తప్పుడు ప్రచారంతో కొందరు నిరద్యోగుల నుంచి దండుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే లష్కర్ పోస్టుపై స్పష్టత ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

అవుట్ సోర్సింగ్ ద్వారా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ డివిజన్–1లో లస్కర్‌ల కొరత తీవ్రంగా ఉంది. కానీ గత ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటులో భాగంగా 13 మంది వీఆర్ఏలను లస్కర్లుగా నియమించింది. కానీ అందులో ఒక వీఆర్ఏ లస్కర్‌గా విధుల్లో చేరకపోవడంతో పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఆ పోస్టును అవుట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది.

మోసపోవద్దు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ డివిజన్–1లో ఒక్క లష్కర్ పోస్టు మాత్రమే ప్రస్తుతం భర్తీ చేసే అవకాశం ఉంది. అనేక మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎవరికీ చిల్లి గవ్వ ఇవ్వాల్సిన పనిలేదు. సీఈ స్థాయిలో నియామకం ఉంటుంది. నిరుద్యోగులు ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దు.

– చక్రపాణి, ఈఈ , ఎస్సారెస్పీ

వసతి గృహ సంక్షేమాధికారుల జిల్లా కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులందరూ ఐకమత్యంతో సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీఎన్‌జీవోస్ జిల్లా భవనంలో తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల జిల్లా సంఘం (టీహెచ్‌డబ్ల్యూవోస్) సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను నరాల వెంకట్‌రెడ్డి సన్మానించారు. జిల్లా అధ్యక్షుడుగా ఎం.చక్రధర్, కార్యదర్శిగా శ్రీనివాస్, సహ అధ్యక్షుడిగా ఎస్.నవీన్‌కుమార్, కోశాధికారిగా చిరంజీవి, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మణ్, రాజేశ్వర్, విజయశాంతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చంద్రకాంత్, పబ్లిసిటీ కార్యదర్శిగా కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా యాదగిరి, నరేష్, గంగసుధ, సందీప్, నరేష్, శాంతి ఎన్నికయ్యారు.

ఇండస్ట్రియల్ టూర్‌కు ధర్మారావ్‌పేట్ విద్యార్థులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ టూర్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలోని ఆనంద్ పాలిమర్స్ కంపెనీని సందర్శించి హెచ్‌డీపీఈ పైపులు ఏవిధంగా తయారవుతాయి.. వాటి క్వాలిటీని తెలుసుకోవడానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తుందనే విషయాలను తెలుసుకున్నారు. క్లబ్ మెంబర్ కృష్ణాకర్ రావు, పాలిమర్ ప్రతినిధులు మూర్తి, కమల్, రాందేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతువేదిక తలుపు ధ్వంసం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ రైతువేదిక భవనం తలుపును దుండగులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసినట్లు ఏవో నర్సింలు తె లిపారు. కార్యాలయంలో ఉన్న రూ.4 లక్షల విలువై న వీడియో కాన్ఫరెన్స్ సెట్ సురక్షితంగా ఉందన్నా రు.ఈ ఘటనపైపోలీసులకుఫిర్యాదుచేశామన్నారు.

ఉద్యోగం పేరిట టోకరా

కామారెడ్డి క్రైం: అమెజాన్ కంపెనీలో ఉద్యోగం ఇస్తామని ఓ వ్యక్తికి రూ.3,850 లకు టోకరా వేశారు. పట్టణంలోని స్నేహపురి కాలనీకి చెందిన నజీరుద్దీన్ అనే వ్యక్తికి మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి అమెజాన్ కంపెనీ లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అందుకు విడతలవారీగా రూ.3,850 ఫోన్ పే ద్వారా వేయించుకున్నాడు. చార్జీల పేరుతో మళ్లీ, మళ్లీ డబ్బులు వేయాలని అవతలి వ్యక్తి చెప్పడంతో అనుమానం వచ్చిన నజీరుద్దీన్ బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉచిత ఫిజియోథెరపి శిబిరం

దోమకొండ: మండల కేంద్రంలోని భవిత విద్య కేంద్రంలో బుధవారం ఫిజియోథెరపి శిబిరం నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ సాయి కిరణ్ వివిధ వ్యాయామ చికిత్సలు అందించారు. సలహాలు, సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఐఈఆర్‌పీ దామోదర్,విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ జగన్నాథం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధిలో భాగంగా విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. సౌత్ క్యాంపస్‌ను కామారెడ్డి జిల్లా యూనివర్సిటీగా మార్చాలని, అలాగే జిల్లా కేంద్రంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, మెడికల్ నర్సింగ్, లా కాలేజ్, కేంద్రీయ విద్యాలయం, టీటీసీ, బీఈడీ, ఎంఈడీ, మహిళా డిగ్రీ కళాశాల, దోమకొండ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే మార్కెట్‌లో రైతుల నుంచి వసూలు చేస్తున్న తైబజార్ ఎత్తివేయాలని, గంజ్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, పట్టణంలో మరొక ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కామారెడ్డి జేఏసీ కన్వీనర్ జగన్నాథం, బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ క్యాతం సిద్ధిరాములు, ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ మల్లన్న, నాయకులు సాప శివరాం, గంగారాం, ఎల్ఎన్. ఆజాద్, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, జీవీఎస్ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్, అరుణ్, సతీష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం కావాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్



చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

నిజాంసాగర్(జుక్కల్): గ్రామ పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ అన్నారు. బుధవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి మొదటి సారిగా వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా చీకోటి మనోజ్ మాట్లాడుతూ.. పంతాలకు తావు లేకుండా పంచాయతీ ఎన్నికలకు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలన్నారు. మహమ్మద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు గుర్రపు శ్రీనివాస్ పటేల్, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

కెరియర్‌పై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి భార్గవి



స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

బాన్సువాడ రూరల్: విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, దాన్ని సాధించడానికి కృషి చేయాలని బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి కుమారి టీఎస్పీ భార్గవి సూచించారు. బుధవారం బోర్లంక్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. బాల్యవివాహాలు చట్టవిరుద్ధమన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనేక దుష్పరిణామాల గురించి వివరించారు. చట్టప్రకారం పురుషుల వివాహ కనీస వయస్సు 21, స్త్రీలకు 18 సంవత్సరాలుగా నిర్ణయించారన్నారు. బాలికావిద్య ద్వారానే బాల్యవివాహాలను నివారించవచ్చన్నారు. విద్యార్థినులు తమ కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ సునీత, యువర్స్ లైఫ్ ఫౌండేషన్ సభ్యులు సచిన్, వేద ప్రకాష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల జాతర



నిజాంసాగర్(జుక్కల్): ఉపాధి హామీ పనుల జాతరలో భాగంగా మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటారు. గ్రామానికి చెందిన పెంటబోయిన భూమయ్యకు చెందిన రెండు ఎకరాల్లో మొక్కలు నాటుతున్నట్లు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వర్ తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

దోమకొండ: మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అక్షయ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. మహిళలు, గృహిణులు, విద్యార్థులకు(18–29 వయసు) ఉచితంగా టైలరింగ్, మగ్గం వర్క్, బ్యుటీషియన్, చీరలపై పూతలు, డాటా ఎంట్రీ ఆపరేటింగ్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ తదితర విషయాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. కోర్సులో చేరేందుకు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు ఇవ్వాలని ఆయన సూచించారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలుశిక్ష

రుద్రూర్: ద్విచక్ర వాహనాన్ని అతివేగం, అజాగ్రత్తగా నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి న్యాయస్థానం బోధన్ కోర్టు అడిషనల్ జడ్జి శివసాయి ఏడాదిన్నర జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై సాయన్న బుధవారం తెలిపారు. 2016 జూలై 19 తేదీన త్రిశూల్ శంకర్ అనే వ్యక్తి బైక్‌పై వస్తుండగా సులేమాన్ నగర్ గ్రామానికి చెందిన షేక్ లతీఫ్ టీవీఎస్ ఎక్సెల్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో శంకర్ మృతి చెందాడని తెలిపారు. బాధితుల తరఫున పబ్లిక్ ప్యాసిక్యూటర్ సీహెచ్ రాణి వాదనలు వినిపించినట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికను ఈవ్ టీజింగ్ చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. బాలికను సదరు యువకులు వేధించినట్లు ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



అజయ్‌కుమార్(ఫైల్)

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన యువకుడు దుర్మరణం చెందినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. గజ్జల అజయ్ కుమార్(26) అనే యువకుడు సిరికొండ వైపు నుంచి మరిమడ్లకు వెళ్తుండగా తాటిపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడగా, తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సౌదీ అరేబియాలో కులాస్‌పూర్ వాసి..



కోర్వ మోహన్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన కోర్వ మోహన్ (45) సౌదీ అరేబియాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి కోసం కోర్వ మోహన్ గత కొన్నేళ్లుగా గల్ఫ్, సౌదీ అరేబియాకు వెళ్లి వస్తున్నాడు. ప్రస్తుతం సౌదీలోని మున్సిపాలిటీ (బల్దియా)లో పని చేస్తున్న ఆయన ఆదివారం పని ప్రదేశంలో వర్షం కురుస్తుండటంతో మ్యాన్‌హోల్ సరి చేసేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సరోజ, కుమారుడు అరవింద్ ఉన్నాడు. మృతదేహాన్ని స్వ గ్రామానికి రప్పించేలా ఎమ్మెల్యే భూపతిరెడ్డి చర్యలు తీసుకో వాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కంటైనర్ ఢీకొని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే పెట్రోలింగ్ హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ప్రతాప్‌సింగ్(50) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మెడిసిన్ కోసం రాథోడ్ ప్రతాప్‌సింగ్ బుల్లెట్‌పై ఆర్మూర్‌వైపు వస్తుండగా జాతీయ రహదారి చౌరస్తా వద్ద హైదరాబాద్‌నుంచి నిర్మల్‌వైపు వెళ్తుతున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రతాప్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



ముత్తన్న(ఫైల్)

పెర్కిట్(ఆర్మూర్): ఖతర్ దేశంలో 15 రోజుల క్రితం మృతి చెందిన ఆలూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గంట చిన్న ముత్తన్న(56) మృతదేహం భారత రాయబార కార్యాలయం అధికారుల చొరవతో బుధవారం స్వగ్రామానికి చేరింది. ఖతర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న ముత్తన్నకు పదిహేను రోజుల క్రితం యజమానితో గొడవ జరగడంతో అక్కడి నుంచి వెళ్లిపోయి స్నేహితుల వద్ద రెండు రోజులు ఆశ్రయం పొందాడు. రెండు రోజుల తర్వాత యజమాని దగ్గరకు వెళ్తున్నానని స్నేహితులకు చెప్పిన ముత్తన్న 13వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే యజమాని ముత్తన్నకు సంబంధించిన ఖతర్ ఐడీని బ్లాక్ చేయించాడు. దీంతో మృతదేహాన్ని అక్కడే మార్చురీలో భద్రపరిచారు. తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మైదం మధు ఐసీబీఎఫ్ సెక్రెటరీ మహ్మద్ ఖుని, శంకర్‌గౌడ్, ప్రవాసీ భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నరసింహనాయుడి ప్రత్యేక చొరవ తీసుకుని మృతదేహాన్ని ఇండియాకు రప్పించారు. కుటుంబసభ్యులు బుధవారం సాయంత్రం ముత్తన్న అంత్యక్రియలు పూర్తి చేశారు.

చలి తీవ్రతను తట్టుకోలేక మృతి?



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నవీపేట: మండల కేంద్రం శివారులోని జీవన్ దాబా ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, చలి తీవ్రతను తట్టుకోలేక మృతి చెంది ఉంటాడని ఎస్సై వినయ్ అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు రెడ్, బ్రౌన్, గ్రీన్ కలర్ లైన్స్ షర్ట్, ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని సోమేశ్వర్ గ్రామానికి చెందిన ర్యాపని మల్లవ్వ (48) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె భర్త కిష్టయ్య బుధవారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లవ్వ ఈనెల 25వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్ళిపోయింది. బుధవారం స్థానిక చెరువులో ఆమె మృతదేహం లభ్యం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతంగల్ గ్రామ శివారులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

నాగంపేట్ శివారులో..

బాల్కొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను నాగంపేట్ శివారులో ఆర్ఐ రాఘవేందర్ బుధవారం పట్టుకున్నారు. ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బస్సు ఎక్కుతుండగా ప్రమాదం

- మహిళకు తీవ్రగాయాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బస్సు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఓ మహిళ కిందపడి తీవ్రగాయాలపాలైంది. ఘటనకు సంబంధించిన గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన కంసవ్వ బుధవారం తాడ్వాయికి వచ్చింది. అనంతరం కామారెడ్డికి వెళ్లేందుకు తాడ్వాయి పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడింది. బస్సులో ప్రయాణికుల రద్దీ ఉండడంతో కిందపడిపోయిన కంసవ్వ కాళ్లపై నుంచి బస్సు వెనుక టైర్లు వెళ్లాయి. కంసవ్వ కుడికాలు నుజ్జునుజ్జుకాగా ఆమెను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆర్టీసీ బస్సును స్టేషన్‌కు తరలించారు.

నగలు, నగదు అప్పగింత

కామారెడ్డి టౌన్: తాడ్వాయిలో చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కంసవ్వను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, ఆమెకు సంబంధించిన నగలు, నగదును పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షతగాత్రురాలి ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, పుస్తెలతాడు, చెవి రింగులతోపాటు నగదును ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ లక్ష్మణ్ బాధితురాలి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కంసవ్వను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.



అద్దె అడిగితే బెదిరించిన ఐదుగురిపై కేసు

కామారెడ్డి క్రైం: అద్దె డబ్బులు చెల్లించాలని అడిగితే బెదిరింపులకు పాల్పడిన ఐదుగురిపై కామారెడ్డి పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బాల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న ఓ భవనాన్ని 11 నెలల అగ్రిమెంట్‌కు పట్టణానికి చెందిన వినోద్ శర్మ, ముజీబ్, శ్రీనివాస్, లక్ష్మణ్, పి.శ్రీనివాస్ కలిసి లీజుకు తీసుకుని జస్ట్ ఫర్ యూ పేరుతో దుకాణం నడుపుతున్నారు. అయితే వారు 8 నెలలుగా ఇంటి అద్దె చెల్లించడం లేదు. సికింద్రాబాద్‌లోని మహేంద్ర హిల్స్‌లో నివాసం ఉండే ఇంటి యజమాని రాజశేఖర్‌రెడ్డి.. అద్దె వసూలు చేయడానికి ఇటీవల కామారెడ్డికి వచ్చాడు. దుకాణంలోకి వెళ్లి అద్దె ఇవ్వాలని అడుగ్గా షాప్ నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులు కలిసి రాజశేఖర్‌రెడ్డిని అసభ్యకరంగా దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో రాజశేఖర్‌రెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మండల కేంద్రంలో రెండు ఇళ్లు దగ్ధమైనట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గుండ బాలకిషన్, స్వామి అనే వ్యక్తులు కుటుంబ సభ్యులతో కలిసి తమ తమ ఇళ్లలో నిద్రిస్తున్న సమయంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో వారంతా ఇళ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేయడంతోపాటు ఫైరింజన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. తన ఇంట్లోని బీరువా, దుస్తులు, వంట సామగ్రి, ఫ్రిజ్, కూలర్, ఫ్యాన్లు, కుర్చీలు, సోఫాలు దగ్ధమై రూ.4లక్షల నష్టం వాటిల్లినట్లు బాలకిషన్ తెలిపారు. అలాగే తన ఇంట్లోని బీరువా, వంట సామగ్రి, ఫ్రిజ్, ఫ్యాన్లు, కుర్చీలు, రూ.56,500 నగదు, తదితర వస్తువులు దగ్ధమై రూ.4లక్షల నష్టం వాటిల్లినట్లు గుండ స్వామి తెలిపారు. ఘటనాస్థలానికి తహసీల్దార్ నరేందర్ చేరుకొని వివరాలు సేకరించారు.

పాత ఇనుప సామాను దుకాణం..

భిక్కనూరు: మండల కేంద్రంలో పాత ఇనుప సామాను దుకాణం బుధవారం రాత్రి దగ్ధమైంది. పాత ఇనుప సామాను వ్యాపారం చేసే అశోక్ దుకాణానికి తాళం వేసి బయటికి వెళ్లిన మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సాయికుమార్ ఘటనాస్థలానికి చేరుకుని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.